# కరణేషు మంత్రి ...!

నీ ఉత్తరం అందింది! విషయాలు తెలుసుకుని ఎంతో సంతోషించాను. 'మా వారు ప్రతీ చిన్న విషయానికీ నా సలహా అడుగుతూ ఉంటారు. ఒక్కొసారి ఎంత విసుగు పుడుతుందో! మంచి పనిలో ఉంటే 'పింకీ! ఈ టేబుల్ ఇక్కడ తీసేసి, అటువైపు పెడితే ఎలా వుంటుందీ' అంటారు. నాకెంత కోపం వస్తుందో తెలుసా? అది కూడా అడగాలా? మీ ఇష్టం వొచ్చిన చోటపెడితే నేనే కాదంటానా?" అంటాను. మళ్లీ ఆయన చిన్నబుచ్చుకోవడం చూసి "ఒస్తున్నా వుండండి!" అంటూ వెళతాను. అని రాశావు. పింకీ! అతనలా ప్రతి విషయం నిన్నడగడం ఆ మాత్రం అతనికి తెలీక కాదు. నిన్ను గౌరవించడం కోసం, నీ సలహాని పాటించి నీ ప్రతిష్ఠని పెంపొందించడంకోసం, అతనలా అడుగుతున్నాడు. అంతేకానీ, అతనిష్టమొచ్చిన చోట ఆ టేబిల్ ని పెట్టెయ్యలేకా కాదూ, అతనికి నచ్చిన బట్టల్ని అతను వేసుకోలేకా కాదు.

భార్యాభర్తలిరువురూ, ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ ఒకరి మాటను ఒకరు అర్థం చేసుకుని, ఒకరి సలహాని ఒకరు గౌరవిస్తూ పాటిస్తూరావడం, ఆ కుటుంబానికి ఎంతో ఆనందదాయకమూ, శ్రేయస్కరమూ అవుతుంది.

ఒక కుటుంబంలో భార్యాభర్తలు, ఒక దేశానికి రాజూ, మంత్రీ లాంటివాళ్లు. భార్య పదవి కేవలం భర్త చెప్పినట్టు వింటూ అన్నింటికీ, గంగిరెద్దులా తలూపుతూ పడుండడం కాదు. తనకి తోచిన సలహాలిచ్చి కుటుంబ వృద్ధికోసం వేసే ప్రతి పథకంలో, ప్రతీ కార్యక్రమంలో తనూ భాగస్థురాలై తన బాధ్యతని నెరవేర్చుకోవాలి. భర్త పెడదారిన వెడుతూంటే హెచ్చరించి సరిదిద్దుకోవాలి. ఏం చేస్తే అతని బుద్ధి మారుతుందో, తన బుద్ధిబలంతో తెలుసుకోవాలి! ఉదాహరణకి, మన పక్కింటి పిల్ల ఆదిలక్ష్మి తెలుసు కదూ! ఆ అమ్మాయి ఎలా వుండేదో కూడా నీకు తెలుసుకదా! తలనిండా నూనె పట్టించేసి, నున్నగా దువ్వుకుని బిగించి వేసుకున్న జడా, తల్లో చామంతి పూలనుంచి మందారాలూ, నుదుటన అర్థ రూపాయంత కుంకం బొట్టు, కళ్లకి అర్థ అంగుళం అంత కాటుక దట్టంగా పులుముకుని, కథాకాళీ డాన్సర్ లా ఉండేది నీకు జ్ఞాపకం వుందా?

అటువంటి ఆదిలక్ష్మికి, బొంబాయిలో వుండే ఒక నేవల్ ఆఫీసర్‌తో పెళ్లవడం మొదటి ఆశ్చర్యం, నేవీలో వుండే అతను ఈ అమ్మాయిని చూసి మెచ్చే చేసుకున్నాడా, చూడకుండా చేసుకున్నాడా? అంటూ రకరకాలుగా చెప్పుకున్నా రారోజుని! అతను ఆ అమ్మాయికి మేనమామ అవుతాడట. చిన్నప్పుడెప్పుడో పెద్దలు నిశ్చయించిన ఈ పెళ్లిని అతను ఇప్పుడు కాదన్నా ఎవరూ అతని మాట వినిపించుకోలేదట. పై గా ఆదిలక్ష్మిని చేసుకోకపోతే ఇచ్చిన మాట తప్పినందుకు ఉరిపెట్టుకుని చస్తానందిట అతని తల్లి. దాంతో అతను చచ్చినట్టు ఆదిలక్ష్మిని చేసుకోక తప్పలేదట. అయితే తనని మామయ్య ఎందుకు చేసుకోనంటున్నాడో గ్రహించిన ఆదిలక్ష్మి, నాటకంలో సీను మార్చినంత తేలిగ్గా, తనని తాను మార్చుకుంది. అదీ అసలు ఆశ్చర్యపడవలసిన విషయం. ఇప్పుడు నువ్వు ఆదిలక్ష్మిని చూస్తే గుర్తుపట్టలేవు. బాబ్డ్ హెయిరూ, నుదుటన చిన్న ఎర్రటి తిలకం బొట్టు, షేవ్ చేసుకున్న కనుబొమలూ, నాజూకైన ప్రింటు చీరెలూ, వాటికి మ్యాచింగ్ లిప్‌స్టిక్కూ, ఆ ఆదిలక్ష్మీ ఈ ఆదిలక్ష్మీ ఒకటేనా అనిపిస్తుంది.

పెళ్లికి ముందు చేసుకోను పొమ్మన్న మామయ్యే ఈ రోజున కొంగుచ్చుకుని తిరుగుతున్నాడు. పింకీ! ఆదిలక్ష్మి మొండిగా తను మారకుండా ఉన్నట్టయితే తల్లి పోరు పడలేక తనా పెళ్లిచేసుకున్నా, అతను సంసారం మాత్రం ఆదిలక్ష్మితో చేసుండేవాడు కాదు. అక్కడే భార్య తన బుద్ధి నుపయోగించాలి. అతని ఆంతర్యం తెలుసుకోవాలి! తదనుగుణంగా తనని తాను మార్చుకోవాలి, లేదా అతనిని తనకణుగుణంగా మార్చుకోవాలి!

పింకీ! సంసారంలో నేర్చుకోవలసిన ప్రాథమిక పాఠాల్లో ఇది రెండవది. అన్నట్టు మొదటిది గుర్తుందిగా! కార్యేషు దాసీ... రెండవది కరణేషు మంత్రి! ఈ విషయం ఆడవాళ్లొక్కరే కాదు. మొగాళ్లు కూడా గుర్తుంచుకోవాలి. భార్యతో సంప్రదించి పన్లుచెయ్యడం భార్యని ఒక మహామంత్రిగా గౌరవించే నైజాన్ని అలవాటు చేసుకోవాలి! ఏమంటావు? పింకీ నీకు ఇంతమంచి భర్త దొరికినందుకు నాకు సంతోషం, గర్వం రెండూ కలుగుతున్నాయి! నేను చెప్పినవన్నీ గుర్తుంచుకుంటావు కదూ!

మీ అమ్మ సుమలత. *